క్లుప్తంగా

పేదల వైద్యానికి భరోసా



అలంపూర్: ప్రభుత్వం పేదల వైద్యానికి భరోసాగా నిలుస్తోందని ఎమ్మెల్యే వీఎం అబ్రహం అన్నారు. మండలంలోని లింగనవాయికి చెందిన శ్రీరాములు కూతురు తన్విక వైద్యఖర్చుల నిమిత్తం సీఎంఆర్ఎఫ్ నుంచి మంజూరైన రూ.లక్ష ఎల్ఓసీని శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనారోగ్యం ఇతర కారణాలతో తప్పని పరిస్థితుల్లో ప్రైవేటు వైద్యం చేయించుకునే పేదలను సీఎం సహాయ నిధితో అన్నివిధాలా ఆదుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటరమణ పాల్గొన్నారు.

హామీల అమలులో విఫలం



గద్వాల అర్బన్: నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు మున్నాబాషా అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్లింలకు 12శాతం రిజర్వేషన్, గుర్రంగడ్డ వంతెన, టెక్స్‌టైల్స్ పార్క్, వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడం, డబుల్‌బెడ్రూం ఇళ్లు తదితర హామీలను విస్మరించినట్లు తెలిపారు. మైనార్టీ రుణాలు, కుట్టు మిషన్లు బీఆర్ఎస్ కార్యకర్తలకే ఇచ్చారని ఆరోపించారు. ఈద్గా, షాదీఖాల పనులను పూర్తి చేయలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి పనులను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అల్తాఫ్ హుస్సేన్, ప్రసాద్, రఫీ, గంజిపేట ఇలియాస్, ఇమాముద్దీన్, అస్లాం, సమీ ఉన్నారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ



మానవపాడు: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం డాక్టర్ రిజ్వానా తాన్వీర్ ఆధ్వర్యంలో 29మంది గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రతినెలా వైద్యపరీక్షలు చేయించుకోవడంతోపాటు వైద్యుల సలహాలు, సూచనలు పాటించాలని తెలిపారు. కార్యక్రమంలో చంద్రన్న పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్

శాంతినగర్: వనపర్తిలో వివిధ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి వచ్చిన మున్సిపల్, ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌ను శుక్రవారం వడ్డేపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

గణేశ్ లడ్డూ రూ.లక్ష 35వేలు

మానవపాడు: మండల కేంద్రంలో వాల్మీకి యూత్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుడి లడ్డూకు గురువారం రాత్రి వేలం నిర్వహించారు. వేలంలో పలువురు పోటాపోటీగా పాల్గొనగా, గ్రామానికి చెందిన బోయ నాగశేషనాయుడు రూ.లక్ష 35వేలకు వేలంపాడి లడ్డూను దక్కించుకున్నారు.

ఆలయంలో చోరీ

అయిజ: మండలంలోని సింధనూరు మశమ్మ ఆలయంలో చోరీ జరిగింది. గ్రామస్తుల వివరాల మేరకు.. గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు మశమ్మ ఆలయం తాళం పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. మశమ్మ విగ్రహంపై 2 గ్రాముల బంగారు పూతతో ఉన్న నగలతోపాటు హుండీని పగులగొట్టి డబ్బులను అపహరించారు. బార్కి రవీంద్ర ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

ఆటోస్టాండ్ ఏర్పాటుకు సహకరించండి



శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీలోని శాంతినగర్‌లో ఆటోస్టాండ్ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరుతూ శుక్రవారం ఎంఐఎం తాలూకా అధ్యక్షుడు కలీముల్లాకు ఆటో డ్రైవర్లు వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం, పాలిటెక్నిక్ కళాశాల, పాఠశాలలు, హాస్టళ్లు ఉన్నాయని.. వివిధ ప్రాంతాల నుంచి ప్రజల సౌకర్యార్థం ఆటోస్టాండ్ ఏర్పాటుకు స్థలం కేటాయించేలా కృషి చేయాలని వారు కోరారు.

ప్లాంట్ల ప్రారంభమెప్పుడో?

- పూర్తయిన ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణాలు
- ప్రారంభంపై దృష్టి సారించని పాలకులు
- గద్వాల, అయిజ మున్సిపాలిటీల్లో నామమాత్రంగా సాగుతున్న నిర్వహణ



అయిజలో నిర్మించిన ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్

అయిజ: పారిశుద్ధ్య నిర్వహణలో భాగంగా మున్సిపాలిటీల్లో ఎఫ్ఎస్‌టీపీ (ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఉమ్మడి జిల్లాలోని పలు మున్సిపాలిటీల్లో ప్లాంట్ల నిర్మాణానికిగాను రూ.18కోట్లు మంజూరు చేశారు. ప్లాంట్‌కు అయ్యే ఖర్చులో సగభాగం ప్రభుత్వం, మిగతాది పీపీపీ ఎన్‌ప్రాం కంపెనీ వారు ఖర్చు చేయాలనే ఒప్పందం ఉంది. ఈ మేరకు అయిజ మున్సిపాలిటీలో ఎస్ఎఫ్‌టీపీ ప్లాంట్ నిర్మించగా, గతేడాది నుంచి వినియోగంలోకి తీసుకొచ్చారు. గద్వాల మున్సిపాలిటీలో ఈ ఏడాది ప్లాంట్ నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వచ్చింది. రెండు మున్సిపాలిటీల్లో అధికారికంగా ప్లాంట్లను ప్రారంభించలేదు. దీంతో వాటి నిర్వహణ నామమాత్రంగా సాగుతోంది. నిర్మాణం పూర్తయిన ప్లాంట్ల ప్రారంభోత్సవంపై పాలకులు దృష్టి సారించడంలేదు. ఇదిలా ఉండగా వడ్డేపల్లిలో రూ.55లక్షలతో ఇటీవల ఎఫ్ఎస్‌టీపీ పనులను ప్రారంభించారు. మరో రెండు నెలల్లో నిర్మాణ పనులను పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇక్కడ నిర్మించే ప్లాంట్‌లో మిషనరీ ఉండదు. షెడ్లు, సంప్‌లు మాత్రమే నిర్మిస్తున్నారు. అలంపూర్‌లో ఎస్‌టీపీ (సివరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) ఉన్నందున ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్ మంజూరును హోల్డ్‌లో పెట్టారు.

ఉమ్మడి జిల్లాలోనే మొట్టమొదటగా..

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే మొట్టమొదటగా అయిజ మున్సిపాలిటీలో ఎఫ్ఎస్‌టీపీ ప్లాంట్ నిర్మాణం పూర్తయ్యింది. నివాసగృహాల సెప్టిక్ ట్యాంక్‌ల నుంచి సేకరించిన మానవ విసర్జితాలను శుద్ధీకరణ చేసి ఎరువు తయారీ నిమిత్తం మున్సిపాలిటీలోని పర్దీపురం సమీపంలో సుమారు రూ.1.5 కోట్లతో ఫీకల్ స్లడ్జ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించారు. పట్టణంలోని సుమారు 7వేల సెప్టిక్ ట్యాంకుల నుంచి మానవ విసర్జితాల తరలింపునకు ప్లాంట్ ఏర్పాటు చేశారు. విసర్జితాల శుద్ధీకరణ ప్రక్రియ మొత్తం ఆధునిక సాంకేతిక పద్ధతిలో సాగుతోంది.

ప్లాంట్‌లో వివిధ విభాగాలు..

ఎఫ్ఎస్‌టీ ప్లాంట్‌ల నిర్వహణకు వివిధ నిర్మాణాలు చేపట్టాల్సి ఉంటుంది. ఆఫీస్‌రూం, మీటింగ్ హాల్, కలెక్షన్ చాంబర్స్, ట్రీట్‌మెంట్ షెడ్, స్టోరేజీ రూం, వాచ్‌మెన్ క్వార్టర్, ల్యాబ్, వేయింగ్ బ్రిడ్జి, ప్లాంట్ చుట్టూ ప్రహరీ నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

యూనిట్ ఇన్‌చార్జ్‌లదే బాధ్యత..

ప్లాంట్ నిర్మాణం పూర్తయిన అనంతరం 10ఏళ్లపాటు నిర్వహణ బాధ్యతలు యూనిట్ ఇన్‌చార్జ్‌లు తీసుకోవాల్సి ఉంటుంది. మున్సిపాలిటీలో సెప్టిక్ ట్యాంక్ యజమానితో మున్సిపల్ అధికారులు ఒప్పందం చేసుకొని మానవ విసర్జితాలను ప్లాంట్‌కు తరలించేవిధంగా చర్యలు తీసుకుంటారు. అనంతరం ప్లాంట్‌లో సాంకేతిక పద్ధతిలో మలాన్ని ఎరువుగా మారుస్తారు. ఎఫ్ఎస్‌టీపీలో తయారైన ఎరువును యూనిట్ నిర్వాహకులు కిలో చొప్పున లెక్క కట్టి విక్రయిస్తారు. అది వ్యవసాయానికి ఎరువుగా ఉపయోగపడుతుంది. అలాగే శుద్ధి చేసిన నీటిని మున్సిపాలిటీ పరిధిలో హరితహారం మొక్కలకు వినియోగిస్తారు. ప్లాంట్లను అధికారికంగా ప్రారంభించి ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తేవాలని పలువురు కోరుతున్నారు.

పారిశుద్ధ్యం మెరుగుపడుతుంది..



మున్సిపాలిటీలో ఎఫ్ఎస్‌టీ ప్లాంట్ సద్వినియోగం అవుతోంది. నివాసగృహాల నుంచి తరలించిన మానవ విసర్జితాలను శుద్ధీకరణ యూనిట్ ప్లాంట్‌లో అనారోబిక్ సెప్టిలైజేషన్ రియాక్టర్‌తో మెథనైజేషన్ పద్ధతిలో శుద్ధి చేస్తారు. అనంతరం నీటిని పాలిసింగ్ ఫండ్‌లో పాస్ఫరేట్, సల్ఫర్ ద్వారా శుద్ధిచేసి ప్యూరిఫైడ్ వాటర్, మలాన్ని ఎరువుగా మారుస్తారు. ఎరువును మొక్కలకు ఉపయోగించవచ్చు.

– గోపాల్, ఇన్‌చార్జ్ ఏఈ

ప్లాంట్ నిర్వహణ కొనసాగుతోంది..



ఉమ్మడి జిల్లాలో చేపట్టిన ఎఫ్ఎస్‌టీపీ పనుల్లో అయిజ మున్సిపాలిటీ మొట్టమొదటగా పూర్తి చేసుకొని ఏడాది నుంచి నిర్వహణలో ఉండటం సంతోషంగా ఉంది. ప్లాంట్ ద్వారా వచ్చిన ఎరువులను మొక్కలకు ఉపయోగించుకోవచ్చు. ఆధునిక సాంకేతిక పద్ధతులు ఏవైనా ఉంటే వాటిని అవలబించేందుకు కృషి చేస్తాం.

– నర్సయ్య, మున్సిపల్ కమిషనర్

రూ.41లక్షలతో పాగుంటస్వామి ఆలయాభివృద్ధి



ఆలయంలో కాలక్షేప మండప నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ

కేటీదొడ్డి: మండలంలోని వెంకటాపురం పాగుంట లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో రూ.41లక్షలతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎంపీపీ మనోరమ అన్నారు. శుక్రవారం ఆలయంలో కాలక్షేప మండప నిర్మాణం, మండప విస్తరణ పనులకు జెడ్పీటీసీ రాజశేఖర్, వైస్‌ఎంపీపీ రామకృష్ణనాయుడుతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రసిద్ధ ఆలయాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. పాగుంట లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఉరుకుందు, సర్పంచ్ ఆంజనేయులు, ఏఓ పురేందర్, శేషిరెడ్డి, హనుమంతు, చక్రధర్, గోపి, శేఖర్‌రెడ్డి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియా వినియోగించండి



మాట్లాడుతున్న ఏడీఏ సక్రియానాయక్

అయిజ: పంటలకు నానో యూరియా వినియోగించి అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ సక్రియా నాయక్ రైతులకు సూచించారు. మండలంలోని ఉత్తనూరు రైతువేదికలో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ బస్తాల్లో లభించే యూరియాకు బదులుగా నానో యూరియాతో పంటలకు ఎంతో మేలు చేకూరుతోందన్నారు. రైతులందరూ నానో యూరియాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులకు ప్రభుత్వం రుణమాఫీ చేసిందని, బ్యాంకుల్లో తీసుకున్న అప్పులు చెల్లిస్తే, బ్యాంకర్లు కొత్త రుణాలు ఇస్తారని తెలిపారు. రుణమాఫీ విషయంలో సమస్యలు ఉంటే బ్యాంక్ అధికారులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ లోకరాజు, ఐసీఐసీఐ బ్యాంక్ మేనేజర్ రఘు పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్

గద్వాల అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సురేష్ ధ్వజమెత్తారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఏబీవీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ శాఖల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాల్సిన ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తోందన్నారు. పోటీ పరీక్షల కోసం నిరుద్యోగులు పస్తులుండి, వేలాది రూపాయలు వెచ్చించి కోచింగ్ తీసుకుంటున్నారని తెలిపారు. టీఎస్‌పీఎస్సీ నిర్లక్ష్యధోరణితో నిరుద్యోగులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిరుద్యోగులపై నిర్లక్ష్యం వహిస్తే తగిన బుద్ధి చెప్పక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో అశోక్, నరేష్, కృష్ణ ఉన్నారు.

అలంపూర్ గడ్డపై కాషాయ జెండా ఎగరవేస్తాం



అలంపూర్‌లో మాట్లాడుతున్న నాగమద్దిలేటి

అలంపూర్: రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో అలంపూర్ గడ్డపై కాషాయ జెండా ఎగరవేస్తామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మధుసూదన్‌గౌడ్, పట్టణ అధ్యక్షుడు నాగమద్దిలేటి అన్నారు. పట్టణంలో శుక్రవారం బీజేపీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో అలంపూర్ అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని ఆరోపించారు. చేతకాని నాయకుల కారణంగా వంద పడకల ఆస్పత్రి, డిగ్రీ కళాశాల ఇక్కడి నుంచి తరలిపోయాయన్నారు. అదే వరుసలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, బాలుర హాస్టల్స్ తరలిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలంపూర్‌పై బీఆర్ఎస్ నాయకులకు ప్రేమ ఉంటే పార్టీకి రాజీనామా చేసి పోరాడాలన్నారు. అసెంబ్లీ నియోజకవర్గ విస్తారక్ ధనుంజయగౌడ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు జగదీష్, జిల్లా కార్యవర్గ సభ్యుడు లక్ష్మణ్, నాగమల్లయ్య, నరేష్, మద్దిలేటి, నాగరాజు, సురేష్‌కుమార్, శరత్‌బాబు, శ్రీధర్, పుల్లన్న, సంగమేశ్వరయ్య, కృష్ణ తదితరులు ఉన్నారు.

బూత్ కమిటీల సమావేశం

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం బీజేపీ బూత్ కమిటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ విస్తారక్ ధనుంజయగౌడ్, మండల అధ్యక్షుడు నర్సింహులు బూత్ కమిటీ అధ్యక్షులతో వివరాలను తెలుసుకున్నారు. పార్టీ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా పని చేయాలని కోరారు.

రైతుల అభ్యున్నతికి కృషి



మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి

మానవపాడు: రైతుల అభ్యున్నతికి కృషి చేస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ శ్రీధర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల రుణాలను మాఫీ చేసిందన్నారు. సింగిల్‌విండో పరిధిలో పంట రుణాలు తీసుకున్న రైతులకు మాఫీ అయిన డబ్బులను చెల్లిస్తామని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. సంఘం బలోపేతానికి అందరూ సహకరించాలని కోరారు. సమావేశంలో పీఏసీఎస్ వైస్‌చైర్మన్ అయ్యన్న, కార్యదర్శి మద్దిలేటి, ప్రభాకర్‌నాయుడు ఉన్నారు.

కృష్ణానదిలో పడి మహిళ మృతి

ఎర్రవల్లిచౌరస్తా: కృష్ణానదిలో పడి ఓ మహిళ మృతి చెందిన ఘటన ఇటిక్యాల పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ అశోక్‌బాబు తెలిపిన వివరాలిలా.. ఓ గుర్తు తెలియని మహిళ (62) శుక్రవారం బీచుపల్లి పుష్కర ఘాట్ వద్ద కృష్ణానదిలో పడి మృతి చెందింది. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీశారు. అనంతరం గద్వాల ప్రభుత్వాస్పత్రికి మృతదేహాన్ని తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతురాలి ఎత్తు 5.2 అడుగులు, ఎరుపు, నలుపు రంగు చీర ధరించిందని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు ఇటిక్యాల పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

చికిత్స పొందుతూ యువతి..

చికిత్స పొందుతూ యువతి మృతి చెందిన సంఘటన ఇటిక్యాల మండలంలోని వేములలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మనీష (23)తో గురువారం ఉదయం కుటుంబ సభ్యులు గొడవ పడటంతో మనస్థాపానికి గురై అదేరోజు రాత్రి పురుగుమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించిడంతో శుక్రవారం మృతి చెందినట్లు వారు పేర్కొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



మురుగునీటి కుంటలో దోమల నివారణ మందు పిచుకారీ చేస్తున్న అధికారులు

అమరచింత: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఆయూబ్‌ఖాన్ అన్నారు. పట్టణంలోని నాల్గో, ఐదో వార్డుల్లో విష జ్వరాల బారిన పడిన ప్రజలు ఆస్పత్రులకు చేరుతున్నారని, వీటి నుంచి తమకు తాము కాపాడుకునేందుకు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఉమ్మడి మండలాల వైద్యాధికారి డాక్టర్ శరత్ ఆదేశాలతో పట్టణంలోని ఆయా వార్డుల్లో శుక్రవారం ఆరోగ్య విషయాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. నిల్వ నీటిని కాకుండా రోజు వారీగా కుళాయిల ద్వారా వచ్చే నీటిని వినియోగించాలన్నారు. నిల్వ నీటి తొట్లల్లో లార్వాలు వృద్ధి చెంది దోమల వ్యాప్తి పెరిగి విష జ్వరాలు, డెంగ్యూ ప్రబలే అవకాశం ఉందన్నారు. ఆయా వార్డుల్లో మున్సిపల్ సిబ్బంది బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కార్యక్రమంలో బ్రీడింగ్ చెక్కర్ విజయ్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే మెరుగైన వైద్యం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఆత్మకూర్: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయని ఎంపీపీ బంగారు శ్రీనివాసులు, చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, వైద్యశాఖ సూపరింటెండెంట్ డాక్టర్ హరినారాయణ అన్నారు. శుక్రవారం ఆత్మకూర్‌లోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా ఆరోగ్యమేళా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవికుమార్, వైద్యులు పుష్పలత, శ్రీనివాస్‌చౌదరి, హరిసాగర్, రాకేష్, శంక్రునాయక్, అంబుజ, శరత్‌చంద్ర, నారాయణరెడ్డి, నిస్సార్ అహ్మద్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

హాస్టళ్ల తరలింపు జీఓ వెనక్కి తీసుకోవాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

అలంపూర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల హాస్టళ్లను మరో ప్రాంతానికి తరలింపునకు జారీ చేసిన జీఓను వెనక్కి తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు బుచ్చన్న కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్‌లకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి నుంచి హాస్టళ్లను తరలిస్తే స్థానిక విద్యార్థులకు నష్టం వాటిల్లుతోందన్నారు. ప్రభుత్వం స్పందించి జీఓ వెనక్కి తీసుకొని, హాస్టళ్లను యథావిధిగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో ఎల్లన్న, నర్సింహా, భాస్కర్, కృష్ణ, ఏలియా, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించే వరకు పోరాటం



సమ్మె చేపట్టిన అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

గద్వాల అర్బన్: అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించే వరకు పోరాటం ఆగదని యూనియన్ జిల్లా కార్యదర్శి ఏమేలమ్మ స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌మార్గ్‌లో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చేపట్టిన సమ్మె శుక్రవారంతో 19వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కార్మికవర్గ వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందన్నారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాడుతామన్నారు. కార్యక్రమంలో సలోమి, ఫరీదా, సుజాత, లక్ష్మి, సుజాత ఉన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



జిల్లా కేంద్రంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశావర్కర్లు

గద్వాల అర్బన్: ఆశావర్కర్ల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ అధ్యక్షురాలు పద్మ కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక తహసీల్దార్ నరేందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొన్ని రోజులుగా ఆశావర్కర్లకు పనిభారం పెరిగిందని, రూ.18వేల పారితోషికం ఇవ్వాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, హెల్త్‌కార్డు, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సునీత, పద్మ, నాగప్రమీల పాల్గొన్నారు.

అలంపూర్: ఆశావర్కర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నర్సింహ కోరారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఆశావర్కర్లు చేపట్టిన నిరసన దీక్ష కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశావర్కర్లతో ప్రభుత్వం వెట్టిచాకిరి చేయించుకుంటోందని, వారి న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. అనంతరం తహసీల్దార్ మంజులకు వినతిపత్రం అందజేశారు. నాగేశ్వరమ్మ, శివలింగమ్మ, కృష్ణవేణి, శ్రీదేవి, విజయలక్ష్మి, నాగలక్ష్మమ్మ, అంజనమ్మ, పద్మ, అబేదాబేగం, భారతి, చంద్రకళ పాల్గొన్నారు.

మల్దకల్: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని నర్సమ్మ, కాంతమ్మ, సుజాత కోరారు.

మానవపాడు: ఆశావర్కర్ల వేతనం రూ.18వేలకు పెంచాలని యూనియన్ నాయకురాలు వెంకటేశ్వరమ్మ, సంతోషమ్మ, నీలమ్మ, లక్ష్మి, శారద కోరారు. ఈ మేరకు తహసీల్దార్ జుబేర్ మొహినుద్దీన్‌కు వినతిపత్రం అందజేశారు.

ధరూరు: మండల కేంద్రంలో ఆశావర్కర్లు బొడ్డెమ్మ ఆడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆశావర్కర్ల సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని, న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.



ధరూరులో బొడ్డెమ్మ ఆడుతున్న ఆశావర్కర్లు



మల్దకల్‌లో ధర్నా చేస్తున్న ఆశాలు

ఆహారం వృథా చేయొద్దు

అమరచింత: ఆహారం మిగిలితే వృథాగా పారవేయకుండా తిండి లేని వారికి అందించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ కోరారు. స్వచ్ఛతాహి సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలో ఫుడ్ వేస్టేజీపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం పోస్టర్లు విడుదల చేశారు. శుభకార్యక్రమాలతో పాటు ఇతర కార్యక్రమాలలో ఆహారం మిగిలితే తెలియచేయాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జీఎస్ గోపి, కమిషనర్ మహమ్మద్ ఖాజ పాల్గొన్నారు.